క్లుప్తంగా

వరి నాట్లు ప్రారంభం



చాట్రాయి: మండలంలోని చాట్రాయి, జనార్థనవరం, ఆరుగొలనుపేట గ్రామాల్లో రైతులు వరి నాట్లు ప్రారంభించారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు తోడు బోర్ల కింద పోసిన నార్లు నాటడానికి రావడంతో పచ్చి రొట్టతో దమ్ములో కలియ దున్ని నాట్లు మొదలు పెట్టారు. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన కూలీలు వరి లైన్ సోయింగ్ విధానంతో నాట్లు వేస్తున్నారు. ఈ విధానంతో మొక్కకు గాలి, వెలుతురు తగలడమే కాకుండా దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందని పురుగు ఉధృతి తక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు దరఖాస్తుల స్వీకరణ

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్ విభాగాల్లో గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలని, ఏపీ సెట్, యూజీసీ సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రెజ్యూమ్‌తోపాటు విద్యార్హత ధృవీకరణ పత్రాల నకలు కాపీలను జత చేసి ఈ నెల 28వ తేదీ లోగా కార్యాలయం పని వేళల్లో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 99591 08829 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

స్కూల్ బస్సుల తనిఖీ



ఇబ్రహీంపట్నం: మండలంలోని వివిధ ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన స్కూల్ బస్సులను ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు గురువారం తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన బీమా తదితర రికార్డులు పరిశీలించారు. టైర్ల పరిమాణం, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్‌సేఫ్టీ పరికరాలపై ఆరా తీశారు. బస్సులో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మద్యం మత్తులో స్కూల్ బస్సులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత దృష్టిలో ఉంచుకుని పాఠశాల ఆవరణలో సైతం ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఆగిరిపల్లి: మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శుభశేఖర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో పేకాట, కోడి పందేలు, గుండాట నిర్వహిస్తే వదిలే ప్రసక్తి లేదన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇక నుంచి పూర్తి స్థాయిలో నిఘా ఉంటుందని శాంతి భద్రతలకు సహకరించాలని తెలిపారు.

ప్రిన్సిపాల్ సరళకుమారికి సత్కారం



మైలవరం: మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సరళ కుమారిని గురువారం సత్కరించారు. ఆమె సేవలు ప్రశంసనీయమని వక్తలు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సరళకుమారి కృష్ణా జిల్లా ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈవో)గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు సరళ కుమారిని సత్కరించి అభినందించారు.

ఆస్తిపన్ను చెల్లించిన ఐలా



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీకి స్థానిక ఐడీఏ (ఐలా) నుంచి రావాల్సిన ఆస్తి పన్నును ఐలా ప్రతినిధులు గురువారం చెల్లించారు. 2023 ఏప్రిల్ నుంచి 2025 జనవరి వరకు చెల్లించాల్సిన ఆస్తిపన్నులో 35శాతం షేర్ మొత్తం రూ. 80,61,055ల చెక్కును మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ బి.రమ్యకీర్తన, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్‌కు ఐలా కార్యదర్శి బి.కృష్ణారెడ్డి, మాజీ కార్యదర్శి బి.రామసుబ్బారావు అందజేశారు. మిగిలిన 65శాతం షేర్‌ను ఐడీఏ నోటిఫైడ్ పంచాయతీ అభివృద్ధి పనులకు వినియోగించుకుంటామని తెలిపారు. ఐలా మేనేజర్ భాస్కర్, కౌన్సిలర్ చెనుమోలు నారాయణ పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

- టెండర్ల దశకు చేరిన ఇంటింటి కుళాయి పథకం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.57.93 కోట్లు మంజూరు
- ఎన్నికల నోటిఫికేషన్‌తో నిలిచిన పనులు



ప్రస్తుతం కొండపల్లి మున్సిపాలిటీకి సరఫరా అవుతున్న తాగునీరు



ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లికి ప్రస్తుతం తాగునీటిని సరఫరా చేసే సంపు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మునిసిపాలిటీ ప్రజల చిరకాల వాంఛ అయిన ఇంటింటికీ కుళాయి పథకం కార్యరూపం దాల్చనుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రత్యేక నిధులుగా రూ. 57.98కోట్లు మంజూరు చేసింది. అయితే ఎన్నికల కోడ్‌తో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఆ తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పనులు జరగకుండా పథకం ప్రకారం అటకెక్కించారనే ఆరోపణలు ప్రజల్లో ఉన్నాయి. ప్రస్తుతం అమృత్ 2.0 పథకంలో రూ.57.12కోట్లు మంజూరు కాగా, రాష్ట్ర ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ నిర్వహణలో టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. టెండర్ల ప్రక్రియ సజావుగా సాగితే సుమారు 20,184 కుటుంబాలకు ఇంటింటికీ తాగునీటి కుళాయి కల సాకారం కానుంది. ప్రస్తుతం రక్షిత తాగునీటి పథకం నుంచి నీటి సరఫరా జరుగుతోంది.

అమృత్ 2.0 పథకంలో రూ. 57.12కోట్లు

దశాబ్దాల కాలంగా ఎదురు చూస్తున్న కొండపల్లి మునిసిపాలిటీ ఇంటింటికీ కుళాయి పథకం రెండోసారి టెండర్ల దశకు చేరింది. అమృత్ 2.0 పథకంలో రూ.57.12కోట్లు నిధులు ప్రస్తుతం మంజూరు చేశారు. ఇంజినీరింగ్ అండ్ చీఫ్ నిర్వహణలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న టెండర్లలో భాగంగా కొండపల్లి మునిసిపాలిటీ ఇంటింటి కుళాయి పథకంపై కూడా ఈనెల 26 నుంచి జులై 28 వరకు ఆన్‌లైన్ టెండర్ల అప్లికేషన్‌లు స్వీకరించనున్నారు. తాగునీటి కుళాయిల ఏర్పాటులో భాగంగా కృష్ణానది సమీపంలో 4.71లక్షల కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన వెల్ ఏర్పాటు చేయనున్నారు. అక్కడి నుంచి పట్టణంలో 4లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఐదు ఒవర్‌హెడ్ ట్యాంకుల నిర్మించనున్నారు. ఒవర్‌హెడ్ ట్యాంకుల నుంచి వీధుల్లో హెచ్‌డీ పైప్‌లైన్ ద్వారా ఇంటింటింకి తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తారు. సకాలంలో పనులు జరిగితే తాగునీటి అవసరాలు తీరతాయని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.

2023లోనే నిధులు మంజూరు

ఇబ్రహీంపట్నం, కొండపల్లి జంట గ్రామాలుగా ఏర్పడిన మునిసిపాలిటీలో సుమారు 85,385 మంది జనాభా, 20,184 కుటుంబాలు ఉన్నాయి. వారి తాగునీటి అవసరాలు దృష్టిలో ఉంచుకుని 2023లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటింటికీ కుళాయి పథకం అమలుకు రూ.57.93 కోట్ల నిధులు మంజూరు చేసింది. పబ్లిక్ హెల్త్, మునిసిపల్ ఇంజినీరింగ్ శాఖ ఉన్నతాధికారులు ఒక వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, రెండు ఎలేవేషన్ స్టోరేజ్ రిజర్వాయర్లు, పైప్‌లైన్ ఏర్పాటు పనులకు టెండర్లు పిలిచారు. ఈలోపు 2024 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో టెండర్ల ప్రక్రియ ఆగిపోయింది.

టెండర్లు సక్రమంగా నిర్వహించాలి



గత ప్రభుత్వంలో టెండర్ల ప్రక్రియకు చేరిన ఇంటింటి తాగునీటి కుళాయి పథకం కావాలని అటకెక్కించారు. కారణాలు ఏమైనప్పటికి పనులు ప్రారంభం కాకపోవడంతో రెండేళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. ఈసారైనా టెండర్లు సక్రమంగా నిర్వహించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి.

–జి.రాణి, కొండపల్లి

అధికారుల నిర్లక్ష్యంతో కాలయాపన



ఇంటింటి కుళాయి పథకానికి గత ప్రభుత్వం నిధులు సమకూర్చినప్పటికీ పాలకులు, అధికారులు పనులు నిర్వహించేందుకు చొరవ చూపలేదు. అధికారుల నిర్లక్ష్యంతో ఇంటింటి కుళాయి కల సాకారం కాలేదు. ఈసారైనా రాజకీయాలు పక్కనపెట్టి మంజూరైన నిధులతో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చాలని కోరుతున్నాం.

–కోలకాని శ్రీనివాసరావు, ఇబ్రహీంపట్నం

నట్టల నివారణ మందుల పంపిణీ



ఆరుగొలనుపేటలో నట్టల నివారణ మందులు అందజేస్తున్న నాగేంద్ర

చాట్రాయి: మండలంలోని ఆరుగొలనుపేట గ్రామంలో గురువారం జీవాల యజమానులకు నట్టల నివారణ మందులను పశు వైద్యాధికారి శివ నాగేంద్ర అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలకు సకాలంలో నట్టల మందులు వేయడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. డాక్టర్ రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: మండలంలోని బత్తులవారిగూడెంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యాన గురువారం జీవాల్లో నట్టల నివారణ మందులను సర్పంచి ముసునూరి లక్ష్మీకాంతం పంపిణీ చేశారు. పశుసంవర్ధకశాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేష్, యనమదల పశు వైద్యాధికారి దుర్గాభవాని, రాజాబాబు పాల్గొన్నారు.

వృద్ధులకు రేషన్ సరుకుల పంపిణీ పరిశీలన

విస్సన్నపేట: వృద్ధులకు, వికలాంగులకు రేషన్ సరుకులు ఇంటివద్దే పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆర్డీఓ కే మాధురి గురువారం పరిశీలించారు. స్థానిక బీసీ కాలనీలో రేషన్ సరుకుల పంపిణీని ఆర్డీఓ పరిశీలించి కొంతమంది వృద్ధులకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే లక్ష్మీకళ్యాణి, పీడీఎస్ డీటీ శివనాగరాజు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక నూజివీడు రోడ్డులోని పెట్రోల్ బంకును ఆర్డీఓ తనిఖీ చేశారు.

5న జాతీయ లోక్ అదాలత్



మైలవరం: వచ్చేనెల 5వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాల్సిందిగా జడ్జి ఎమ్. శైలజ కోరారు. మైలవరం కోర్టు ప్రాంగణంలో గురువారం కోర్టు పరిధిలోని పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగిన పరిష్కారానికి కక్షిదారులను ప్రోత్సహించాలని మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి ఎమ్ శైలజ సూచించారు. రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారులు తమ విలువైన సమయం , డబ్బు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మనోవర్తి, సివిల్, బ్యాంక్ కేసులు పరిష్కారం చేసుకోవాలని సూచించారు.

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారం

ఏసీపీ ప్రసాదరావు

తిరువూరు: యువత ఎక్కువగా మాదకద్రవ్యాలకు ఆకర్షితులవుతూ వారి జీవితాన్ని అంధకారం చేసుకుంటున్నారని ఏసీపీ ప్రసాదరావు పేర్కొన్నారు. యువత గంజాయి, మాదకద్రవ్యాల బారిన పడవద్దని సూచిస్తూ గురువారం తిరువూరులోని బోస్ సెంటర్ నుంచి బస్టాండు మీదుగా జెడ్పీ బాలికోన్నత పాఠశాల వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. ఏసీపీ ప్రసాదరావు మాట్లాడుతూ గంజాయి అమ్మినా, సేవించినా నేరమని, ఇందుకు పాల్పడే వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరువూరు సీఐ గిరిబాబు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

నూజివీడు: యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి సూచించారు. పట్టణంలోని మేటాస్ నర్సింగ్ కళాశాలలో గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ మాదకద్రవ్యాలను సేవించినా, కలిగి ఉన్నా, రవాణా చేస్తున్నా చట్ట ప్రకారం నేరమని తెలిపారు. దీనికిగాను ఆరు నెలల నుంచి 20 ఏళ్ల వరకు జైలు శిక్ష, లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించొచ్చన్నారు. యువత విద్యార్థి దశలోనే జీవితంలో ఏం సాధించాలో లక్ష్యం పెట్టుకొని దాని కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం రమేష్, న్యాయవాదులు ఇందుపల్లి సత్యప్రకాష్, ఎస్‌కేడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలపై అవగాహన ర్యాలీ

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మైలవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి పుష్పలత తెలిపారు. ఇబ్రహీంపట్నం జెడ్పీ పాఠశాలలో గురువారం మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల హెచ్‌ఎం సాయికుమారి, సూపర్ వైజర్లు మాధవి, శివకుమారి పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శివ పార్వతి

డ్రగ్స్ వినియోగం నేరం

మైలవరం: మాదకద్రవ్యాలు వాడి జీవితాలు నాశనం చేసుకోవద్దని తహశీల్దారు అబ్దుల్ ధారియా సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని మైలవరంలో పోలీస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జే. శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగదారులు, వాటిని సరఫరా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ హైస్కూల్ నుంచి డౌన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది, లయన్స్ క్లబ్, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మైలవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మైలవరం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు హరిబాబు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విస్సన్నపేట: మాదకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీఓ కే మాధురి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మాదకద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ లక్ష్మీకళ్యాణి, డీటీ హేమప్రసాద్, రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక వికాస్ కళాశాల విద్యార్థులు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ, అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.



నూజివీడు ర్యాలీలో మంత్రి కొలుసు పార్థసారథి



విస్సన్నపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ మాధురి



తిరువూరులో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహిస్తున్న పోలీసులు

వికాస్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్ నర్సిరెడ్డి, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

నూజివీడు: మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేసి డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మాదకద్రవ్యాల నివారణపై గురువారం నూజివీడులో నిర్వహించిన అవగాహన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్, డీఎస్పీ కేవీఎస్‌వీ ప్రసాద్, టౌన్ సీఐ పి.సత్యశ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ గుగులోతు భద్రూనాయక్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో వాదులాడుకుంటున్న కౌన్సిలర్లు

నూజివీడు: ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ప్రజలు ఓట్లేసి ఎన్నుకున్న కౌన్సిలర్లను సంప్రదించకుండా వార్డుల్లో పనులు పెట్టడంపై పలువురు కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వార్డుల అభివృద్ధి కోసం పనులు చేపట్టేటప్పుడు కౌన్సిలర్‌కు తెలియజేయకపోవడం దారుణమంటూ మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ శీలం రాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొమ్ము వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైందన్నారు. కౌన్సిలర్లు ఫోన్ చేస్తే మున్సిపల్ అధికారులు ఫోన్లు ఎత్తడం లేదని తెలిపారు. సీనియర్ కౌన్సిలర్ శీలం రాము మాట్లాడుతూ అజెండాలో పలు పనులు పెట్టారని, వాటిని ఎవరు ప్రతిపాదించారో సమాచారం లేదని, దీనికి మున్సిపల్ కమిషనర్ సమాధానం చెప్పాలన్నారు. నిధులు లేవంటూనే సాధారణ నిధుల నుంచి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలను చేస్తున్నారన్నారు. దీంతో టీడీపీ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కౌన్సిలర్ సాధన ప్రవంతి మాట్లాడటంతో ఇరువర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం నెలకొంది. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ పనులు చేపట్టేటప్పుడు ఆ వార్డు కౌన్సిలర్ దృష్టికి సమాచారాన్ని తీసుకెళ్లాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు వాదోపవాదాలకు దిగి సమయాన్ని వృథా చేయొద్దన్నారు. సమావేశంలో కో-ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, షేక్ మెహబూబ్‌బీ, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, డీఈ వెంకట్రావు, ఏఈ మారయ్య బాబు, టీపీఓ కే వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలకు రూ.25లక్షలు కేటాయించడం తగదు



తిరువూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తిరువూరు: ప్రజారోగ్యానికి పలు కార్యక్రమాలు చేపట్టాల్సి ఉన్నందున డ్రెయినేజీలను శుభ్రపరచడానికి రూ. 25లక్షలు కేటాయించడం తగదని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావులు పేర్కొన్నారు. గురువారం తిరువూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో పట్టణంలో డ్రెయినేజీలను శుభ్రపరడానికి నగరపంచాయతీ సాధారణ నిధుల నుంచి రూ.25లక్షలు కేటాయించాలని టీడీపీ కౌన్సిలర్లు ప్రతిపాదించారు. ఇందుకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు సాధారణ నిధులు అరకొరగా ఉన్నాయని అభ్యంతరం తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఈ విషయమై సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని కౌన్సిలర్లకు సూచించారు. చైర్‌పర్సన్ నిర్మల, కమిషనర్ మనోజ, సభ్యులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే విజయాలు సాధ్యం



కొండపల్లిలో విద్యార్థినులను సత్కరించిన హెచ్‌ఎం హేమలత

మైలవరం: పట్టుదలతో చదివితే అనుకున్న విజయాలు సాధిస్తారని పాఠశాల హెచ్‌ఎం కే కుసుమ కుమారి తెలిపారు. ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన చిలుకూరివారిగూడెం శ్రీఅప్పిడి సుబ్బారెడ్డి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు వి. జ్యోతి ప్రసన్న, ఓ షారోన్, వై. సంజనలను గురువారం సత్కరించి, నగదు బహుమతి అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కొండపల్లి జెడ్పీ హైస్కూల్ బాలికలు దేవరకొండ జోత్స్న, చట్టు వెంకటబార్గవి, బండి యశ్విని, ఎం.నాగమనస్విని పాఠశాల హెచ్‌ఎం హేమలత గురువారం శాలువాలతో సత్కరించి అభినందించారు. ఎస్ఎంసీ చైర్మన్ బాజీబీ, వైస్ చైర్మన్ సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడు అభివృద్ధికి కృషి

నూజివీడు: స్వర్ణాంధ్ర విజన్ - 2047 లక్ష్యాల సాధనలో భాగంగా ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా నూజివీడు నియోజకవర్గ విజన్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను రూపొందించినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. నూజివీడు రోటరీ కల్యాణ మండపంలో గురువారం జిల్లా, నియోజకవర్గ అధికారులు, ప్రజా ప్రతినిధులతో విజన్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ నూజివీడును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్, డీఎఫ్ఓ శుభం, పశు సంవర్థక శాఖ డైరెక్టర్ దామోదరనాయుడు, డీఆర్‌డీఏ పీడీఆర్ విజయరాజు, జెడ్పీ సీఈఓ ఎం.శ్రీహరి, ఎల్‌డీఎండీ నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సర్పంచులకు శిక్షణ

నూజివీడు: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని మహిళా సర్పంచులకు నూజివీడులోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ వెంకటరత్నం మాట్లాడుతూ సర్పంచులు పంచాయతీ, అధికారాలు-విధులు తదితర అంశాలపై అవగాహన పెంచుకొని గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల ఆదరణ పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, బాపులపాడు ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు కార్మికుల సత్కారం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్‌లను సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు గురువారం ఘనంగా సత్కరించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చైర్మన్‌ను కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, కార్మికులకు అండగా ఉంటామని వారు తెలిపారు. కార్మిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

నందిగామరూరల్: రైతులు లాభదాయకమైన పంటల సాగుపై దృష్టి సారించాలని మాజీ మంత్రి, కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురాం సూచించారు. మండలంలోని కంచల గ్రామంలో ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ మేళాను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని, రైతులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందన్నారు. పతంజలి ఫుడ్స్ డీజీఎం వీరేంద్రచౌదరి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. ఏపీఎంఐపీ పీడీ సుభాని, డీహెచ్‌వో బాలాజీకుమార్, ఉద్యానశాఖాధికారి వర్ధిని, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి

ముసునూరు: రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసి నూజివీడు బదిలీ అయిన ఉత్తమ ఉపాధ్యాయుడు కొత్తపల్లి లోకరాజును గురువారం ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అధ్యక్షతన పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొండా దుర్గాభవాని మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ విద్యనందించి, ఉన్నతంగా తీర్చిదిద్దాలని అన్నారు. హెచ్‌ఎం భాస్కరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామసమీపంలో వేంచేసియున్న హరిహర కోటిలింగ మహాక్షేత్రంలోని వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అర్చకుడు తేజశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.